క్లుప్తంగా

30న సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 30న ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్, గీతాంజలి ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏషామ్ మస్తాని-14 పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సంగీత విభావరిలో ప్రముఖ గాయని శ్రీ లలిత, పలువురు గాయకులు పాల్గొని సినీ పాటల్ని ఆలపిస్తారు. కామెడీ కింగ్ శివ మిమిక్రీ ఉంటుంది. సంగీతాభిమానులంతా పాల్గొనాలని నిర్వాహకులు అమ్మపండు కోరారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవం



నగరంపాలెం: దేశంలో రెండో అతి పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం నగరంలోని ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా పర్యావరణ హితమైన పది వేల గుడ్డ సంచుల్ని గుంటూరు పరిసర గ్రామాల్లో పంపిణీ చేశారు. గుంటూరు నగర వీధుల్లో వాక్ థాన్ నిర్వహించారు. అనంతరం శిబిరంలో బ్యాంక్ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఖాతాదారులు, శ్రేయోభిలాషులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ ఎం.వి.శేషగిరి, డెప్యూటీ రీజినల్ మేనేజర్ వెంకట్ జైని, ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

23న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల 'చలో విజయవాడ'



నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఈ నెల 23న 'చలో విజయవాడ' నిర్వహిస్తున్నట్లు సమాఖ్య జేఏసీ అధ్యక్షుడు చుక్కా నాగభూషణం తెలిపారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ పదోన్నతుల్లో ఎస్సీలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం వద్ద వినిపించేందుకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారుల జేఏసీగా ఏర్పడి విజయవాడలో ఆదివారం ధర్నా నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉద్యోగ సమాఖ్య నాయకులు టి. దేవరాజ్, కె. సుధాకర్, కె. రామారావు, గుర్రం రామారావు, దళిత సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, జొన్నలగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సెల్ షాపులో చోరీ

గుంటూరు ఈస్ట్: సెల్ షాపులో గురువారం భారీ చోరీ జరిగింది. కంకరగుంట గేటు సమీపంలో ఒంటిపులి వెంకటేశ్వర్లు నెల రోజుల కిందట గాయత్రి మొబైల్స్ అండ్ యాక్సెసరీస్‌ను నూతనంగా ప్రారంభించారు. బుధవారం షాపు తెరిచేందుకు వెళ్లగా షట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా క్యాష్ కౌంటర్‌లో రూ. 30వేలతో పాటు రూ. 3 లక్షల విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ ఘటన తన షాపు సమీపంలో ఉన్న మరో మొబైల్ షాపు సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి షాపు షట్టర్ తాళాలు పగులగొట్టి లోపలకు వెళ్లి, 45 నిమిషాల పాటు అక్కడే ఉన్నట్లు సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. చోరీపై వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు కింద పడి దివ్యాంగుడు ఆత్మహత్య



లక్ష్మీపురం: ప్రేమ విఫలం కావడంతో దివ్యాంగుడు బ్రాడీపేటలోని రైల్వే పట్టాలపై ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. రైల్వే జీఆర్పీ ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా రాచర్ల గ్రామానికి చెందిన సనగల నాగేశ్వరరావు (35) కొంతకాలంగా బ్రాడీపేటలోని అంధుల ఆశ్రమంలో ఉంటున్నాడు. అక్కడ పరిచయమైన దివ్యాంగురాలితో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. ప్రియురాలు గత కొన్ని రోజులుగా ఫోన్ ఎత్తకపోవడంతో మనస్తాపంతో నాగేశ్వరరావు బుధవారం బ్రాడీపేటలోని రైలు పట్టాలపై ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన ఆర్పీఎఫ్ పోలీసులు రక్షించి స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. గుంటూరు మీదుగా గిద్దలూరు రైలు ఎక్కించి నాగేశ్వరరావు స్వగ్రామమైన రాచర్ల పంపించారు. నాగేశ్వరరావు గురువారం తిరిగి గుంటూరు వచ్చి బ్రాడీపేట 1/14వ లైనులో అటుగా వచ్చే ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల విచారించగా మృతుడు నాగేశ్వరరావు బ్రాడీపేటలోని అంధుల ఆశ్రమంలో ఉంటున్నట్లు తెలిసింది. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలిపి, జీఆర్పీ పోలీసులు ఆత్మహత్యగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి తరలించారు.

కార్పొరేటర్ల ఫిర్యాదులు, సమస్యలకు తక్షణ పరిష్కారం

అధికారులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



కార్పొరేటర్లతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: కార్పొరేటర్ల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల్ని సంబంధిత విభాగాధిపతులే ప్రత్యక్షంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు.తన చాంబర్‌లో గురువారం నగర కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి సోమవారం స్పందన, ప్రతి రోజు వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజా స్పందన నిర్వహిస్తున్నామని వివరించారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు కూడా కమిషనర్‌తో చర్చించడానికి ప్రత్యేక సమయం కావాలని కోరడంతో వారంలో ఒక రోజు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన రోజుల్లో కూడా కార్పొరేటర్లు తమ డివిజన్‌లోని సమస్యల్ని వాట్సాప్, ఫోన్ ద్వారా తెలిపినా పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనల్ని క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు వారికి తెలిపేలా అధికారుల్ని ఆదేశించినట్లు చెప్పారు. కార్పొరేటర్లు ప్రతిపాదించిన వాటిలో ఆయా విభాగాధిపతులు మౌలిక వసతులకు సంబంధించిన వాటికి వెంటనే అంచనాలు సిద్ధం చేసి, ప్రతిపాదనలు పంపాలని కమిషనర్ ఆదేశించారు.

టీడీఆర్ బాండ్లు వేగంగా పంపిణీ చేయాలి

నెహ్రూనగర్: రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఎండార్స్‌మెంట్లు, టీడీఆర్ బాండ్లను వేగంగా పంపిణీ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి పట్టణ ప్రణాళిక అధికారుల్ని ఆదేశించారు. తన క్యాంప్ కార్యాలయంలో గురువారం పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంగా పనిచేస్తూ పనుల్ని వేగవంతం చేయాలని చెప్పారు. ప్రధానంగా ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు విస్తరణ పనుల్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. బకాయిలు చెల్లించకుండా మీడియా సంస్థలు బోర్డుల మీద యాడ్స్ పబ్లిష్ చేసుకుంటున్నాయని, వెంటనే యాక్షన్ ప్లాన్ చేపట్టాలని సూచించారు. బకాయిలు చెల్లించని బోర్డులను వెంటనే తొలగించాలని సిటీ ప్లానర్‌కు స్పష్టం చేశారు. కోర్టు కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసుల వారీగా ప్రతి వారం సిటీప్లానర్ సమీక్ష చేయాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, ఏసీపీలు బాబూరావు, అజయ్ కుమార్, డీఈఈ రమేష్ బాబు, టీపీఎస్‌లు, ఏఈ పాల్గొన్నారు.

సమగ్ర ఓటర్ల జాబితాకు సహకరించాలి

నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గ ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్- 2024కు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం నిర్వహించే వివిధ ప్రక్రియల్లో రాజకీయ పార్టీలు భాగస్వాములై తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించడానికి అధికారులకు సహకరించాలని తూర్పు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్ఓ), నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పోలింగ్ స్టేషన్‌కు ఒకరిని చొప్పున బూత్ లెవల్ ఏజెంట్‌ను నియమించాలని కోరారు. బీఎల్ఓలు ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు వార్డుల్లో పర్యటించి ఓటర్ల నమోదు చేపడతారని తెలిపారు. పాత డోర్ నంబర్లు ఉన్న ఓటర్లకు కొత్తవి నమోదు చేస్తారని చెప్పారు. దీనిపై ఇప్పటికే బీఎల్వోలకు పూర్తి స్థాయిలో శిక్షణ కూడా ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ నెలాఖరున రాజకీయ పార్టీల ప్రతినిధులతో మరోమారు సమావేశం అవుతావుతామని కమిషనర్ తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ఓటరు లిస్టుల్లో ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తుల ఓట్లు వేర్వేరు పోలింగ్ స్టేషన్లలో ఉన్నాయని, వాటిని ఒకే బూత్‌లోకి చేర్చాలని కోరారు. సచివాలయాల్లో ఉద్యోగులకు ఓటరు దరఖాస్తులపై అవగాహన ఉండేలా చర్యలు తీసుకోవాలని, బీఎల్వోల ఫోన్ నంబర్లు సచివాలయాల్లో ప్రదర్శించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పశ్చిమ ఈఆర్వో, అదనపు కమిషనర్ పెద్ది రోజా, ఏఈఆర్వోలు బి. శ్రీనివాసరావు, ప్రదీప్ కుమార్, కోటయ్య, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ పద్మ, పలు పార్టీల నేతలు సీహెచ్.వాసు, మణి కుమారి, మాల్యాద్రి, అంజిబాబు, కె కె.గుప్త, రమేష్ బాబు, ఎస్.ఓంకార్, టి.సేవా కుమార్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజల దగ్గరకే ప్రభుత్వ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ నూరి ఫాతిమా. వేదికపై డెప్యూటీ మేయర్ సజీల

పాత గుంటూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి, వారికి మంచి చేయాలన్నదే వైఎస్సార్ సీపీ ధ్యేయమని తూర్పు నియోజకవర్గ నాయకురాలు షేక్ నూరి ఫాతిమా అన్నారు. 15 డివిజన్‌లోని 48, 49, 50, 51 సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ రామన బోయిన అజయ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిలుగా నూరి ఫాతిమా, డెప్యూటీ మేయర్ షేక్ సజీల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫాతిమా మాట్లాడుతూ ప్రభుత్వ సేవల్ని ప్రజల దగ్గరకే తీసుకువచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. జగనన్న సురక్షతో ప్రజల దగ్గరకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. డెప్యూటీ మేయర్ సజీల మాట్లాడుతూ గత ప్రభుత్వాల పాలన, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో తేడాను గుర్తించి ప్రజలంతా సీఎం జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాల్ని అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ ఫర్జానా, వైఎస్సార్ సీపీ నాయకులు రాంబాబు, మస్తాన్‌వలి, సుభాని, నరసింహారావు, కట్టా వెంకటేశ్వర్లు, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యం

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. కృష్ణయ్య



సదస్సులో మాట్లాడుతున్న కృష్ణయ్య

పాత గుంటూరు: రైతు, కార్మిక, ప్రజా సంఘాల ఐక్యతతో నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని కోరుతూ ఈ నెల 30న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. కృష్ణయ్య కోరారు. బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో గురువారం రైతు, కార్మిక, ప్రజా సంఘాల జిల్లా సదస్సు నిర్వహించారు. సభకు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ భారత వ్యవసాయానికి, రైతాంగానికి తీవ్రమైన హాని కలిగించే మూడు నల్ల వ్యవసాయ చట్టాల్ని రద్దు చేస్తానని నరేంద్ర మోదీ రైతులకు హామీ ఇచ్చి ఇప్పటికీ అమలు చేయలేదని తెలిపారు. పార్లమెంట్‌లో విద్యుత్ బిల్లును ప్రవేశపెట్టడమే కాకుండా పంపు సెట్లకు స్మార్ట్ మీటర్ల వేగవంతం చేస్తున్నారన్నారు. రైతుల సమస్యలపై పోరాటం సాగించాలని సంయుక్త కిసాన్ మోర్చా నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. కార్యక్రమంలో తెలుగు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య, తెలుగు రైతు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.లక్ష్మణ్‌రెడ్డి, కిసాన్ క్రాంతి సంఘర్ష సంఘం రాష్ట్ర కార్యదర్శి మన్నవ హరిప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు దడారి సుబ్బారావు, ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి తోమాటి శివయ్య, శాస్త్రవేత్త ప్రొఫెసర్ టి.వేణుగోపాలరావు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'టెక్నాలజీ టుడే' పుస్తకావిష్కరణ

ఏఎన్ యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యాంత్రిక, సాంకేతిక కళాశాల సహాయ ఆచార్యులు డాక్టర్ భవనం నాగకిశోర్, డీవీఎస్ఆర్‌కే చైతన్య, ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి, కేఎల్ యూనివర్సిటీ సహ ఆచార్యులు డాక్టర్ వసుజాదేవి రాసిన 'టెక్నాలజీ టుడే' పుస్తకాన్ని గురువారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరూ సాంకేతికతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి మాట్లాడుతూ బొమ్మల సహ ప్రచురించిన ఈ పుస్తకంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు తెలుసుకునేలా రాయడం అభినందనీయమని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను ప్రతిబింబించే పుస్తకాలు రాయడం గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం నాగకిశోర్ డిజిటల్ లైబ్రరీని నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. యూనివర్సిటీ యాంత్రిక, సాంకేతిక కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య, డీన్ ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ యాంత్రిక కళాశాల సహాయక ఆచార్యులు పరిశోధనా పత్రాలు, పేటెంట్లు, పుస్తక ప్రచురణలు చేయడం యూనివర్సిటీకి గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచార్య అమృతవల్లి, ఆచార్య రాజేశ్వరి, ఆచార్య సత్యనారాయణ, రామారావు పాల్గొన్నారు.

ఏటీఎంలో బ్యాటరీలు చోరీ

పట్నంబజారు: నగరంలో ఓ ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తులు బ్యాటరీలు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట సీఐ షేక్ అన్వర్ బాషా తెలిపిన వివరాల ప్రకారం ... ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం ఉదయం బ్యాటరీల్ని చోరీ చేశారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

క్యాంటీన్లలో పరిశుభ్రత పాటించకపోతే చర్యలు

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్



సూపరింటెండెంట్ కార్యాలయం ప్రారంభిస్తున్న రోగి సహాయకురాలు పార్వతి

గుంటూరు మెడికల్: జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ గురువారం ఆసుపత్రిలోని కమర్షియల్ క్యాంటీన్, రోగులకు, డ్యూటీ డాక్టర్లకు భోజనం సరఫరా చేసే డైట్ విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైట్‌లో అపరిశుభ్ర వాతావరణం, కూరగాయలు తరిగే చోట పరిశుభ్రత లోపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం డైట్ కాంట్రాక్టర్‌కు రూ. 30 లక్షలు చెల్లిస్తుందని, అయినా తగినంత మంది సిబ్బందిని నియమించుకోకపోవడం, రోగులకు సరైన సమయానికి ఆహారం అందించలేకపోతున్నారని మండిపడ్డారు. డైట్ క్యాంటీన్‌లో మూడు రోజుల్లో మార్పు రాకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భోజనం ట్రాలీని కారిడార్‌లో ఒక మూలన పెడుతున్నారని, దీని వల్ల రోగుల సహాయకులు ఇబ్బంది పడుతున్నారని, ఈ పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు.

కమర్షియల్ క్యాంటీన్‌లో...

ఆసుపత్రిలోని కమర్షియల్ క్యాంటీన్‌లో అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ కోపగించుకున్నారు. క్యాంటీన్ నిర్వాహకులు హెచ్‌డీఎస్ కమిటీకి రూ. 35 లక్షలు బకాయిలు చెల్లించాలని, 15రోజుల్లోగా చెల్లించకపోతే ఆసుపత్రి నుంచి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేశారు. సకాలంలో కమర్షియల్ క్యాంటీన్ నిర్వాహకులు డబ్బులు చెల్లించి ఆసుపత్రి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా, పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. క్యాంటీన్ బయట టీ, ఇతర వస్తువులు విక్రయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీల్లో సూపరింటెండెంట్ వెంట సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని ఉన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

రక్షణ సైన్యం 128వ వార్షికోత్సవం సందర్భంగా గైనకాలజీ విభాగంలో గురువారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రక్షణ సైన్యం జిల్లా కమిటీ సభ్యుడు మేజర్ శ్యామ్‌సన్, సునీత కుమారి, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు పాల్గొన్నారు.

గోడలపై స్టిక్కర్లు అంటిస్తే కఠిన చర్యలు

జీజీహెచ్‌లో గోడలపై స్టిక్కర్లు అంటించి ఆసుపత్రిని అపరిశుభ్రం చేయవద్దని, ఎవరైనా గోడలపై స్టిక్కర్లు అంటిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం క్యాజువాల్టి గోడలపై స్టిక్కర్లు అంటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్యాజువాల్టీలో సూపరింటెండెంట్ కార్యాలయం ప్రారంభం

జీజీహెచ్ క్యాజువాల్టీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రెండో కార్యాలయాన్ని గురువారం ఆసుపత్రికి వచ్చిన రోగి సహాయకురాలు పార్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ క్యాజువాల్టిలో రెండో చాంబర్ ఏర్పాటు చేయడం వల్ల రోగుల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ఉపయోగపడుతోందన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్లు ఆషా సజని, సమీనాబేగం పాల్గొన్నారు.

పాత నేరస్తులపై నిఘా ఉంచాలి



గుంటూరు ఈస్ట్: వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో బుధవారం జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ పర్యటించారు. అరండల్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో శంకర్ విలాస్ సెంటర్, రైల్వే అండర్ బ్రిడ్జి, బ్రాడీపేట 1వ లైను, నగరంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని అండర్ బ్రిడ్జి, పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలోని కంకరగుంట ఫ్లైఓవర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని చెప్పారు. నిరంతరం గస్తీ తిరుగుతూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. రక్షక్ వాహనాలు, బ్లూ కోట్స్ వాహనాలు గస్తీ ముమ్మరం చేయాలని తెలిపారు. అనుమానితులు కనిపించినా, పాత నేరస్తుల్ని గుర్తించినా, వారిని ప్రశ్నించి నేరాలకు పాల్పడకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలని చెప్పారు. ఆయన వెంట వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్‌ఓలు రామానాయక్, రాజశేఖరరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరసింహారావు, ఎస్బీ సీసీ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌ను శుభ్రం చేసిన ప్రజారోగ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్



నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ 11వ లైను న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ రోడ్డులో రోడ్డును ఆక్రమించుకుని నివాసముంటున్న ఇళ్లను పట్టణ ప్రణాళిక అధికారులు కొద్ది రోజుల కిందట తొలగించారు. అయితే, ఈ సమయంలో వ్యర్థాలు డ్రెయిన్‌లో అడ్డంపడి మురుగు పారుదల నిలిచింది. సదరు ప్రాంతం అంతా దుర్గంధంతో, దోమలు స్వైరవిహారం చేస్తుండటంపై సోమవారం సాక్షి దిన పత్రికలో 'వ్యర్థాలతో పూరుకుపోయిన డ్రైయిన్లు' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ప్రజారోగ్యధికారులు గురువారం జేసీబీ సహాయంతో డ్రెయిన్‌లో వ్యర్థాల్ని తొలగించి, శుభ్రం చేశారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు



పాత గుంటూరు: మూడో డివిజన్ పరిధిలోని ప్రగతీనగర్ 5వ లైనులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో వేరొక స్తంభాన్ని గురువారం సిబ్బంది ఏర్పాటు చేశారు. ఈ నెల 17వ తేదీన 'విద్యుత్ స్తంభంతో వణుకు' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. వెంటనే స్తంభాన్ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. అధికారుల స్పందనకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. పనుల్ని విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ హరి, లైన్‌మేన్ సాంబశివరావు పర్యవేక్షించారు.

యార్డు ఛైర్మన్ రాజనారాయణకు అభినందనలు



రాజనారాయణను సత్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు తదితరులు

పట్నంబజారు: గుంటూరు మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా నియమితులైన నిమ్మకాయల రాజనారాయణ యాదవ్ బుధవారం జనవరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్ధార్థనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఛైర్మన్‌గా నియమితులైన రాజనారాయణను దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకంతో మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా రాజనారాయణను నియమించడం సంతోషంగా ఉందన్నారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ రాజనారాయణ మాట్లాడుతూ ఈనెల 30న భారీ ర్యాలీ నిర్వహించి, బాధ్యతలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కమిటీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులు, నాయకులు, అధికారులతో కలసి ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, పార్టీ సీఈసీ సభ్యుడు తాడిశెట్టి మురళీమోహన్ పాల్గొన్నారు.

- బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా నియమితులైన నిమ్మకాయల రాజనారాయణను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు కొప్పుల విజయమాధవి, సీడీ భగవాన్, గనిక ఝాన్సీరాణి, అత్తోట జోసఫ్, నర్గీస్, పెరికల కృష్ణమోహన్, ఆవుల సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

- విద్యాకాంతులతో పేదరికపు చీకట్లు తొలగిస్తున్న సీఎం
- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



విద్యార్థినులకు పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలోనే కాదు అక్షరాస్యత శాతంలోనూ దేశంలోనే అగ్రగామి తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని శాసన మండలి సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినులకు గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆయన స్టడీ మెటీరియల్, యూనిఫాం, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు సరోజిని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడారు. విప్లవాత్మక సంస్కరణలతో రాష్ట్రంలో విద్యా వ్యవస్థను సమూలంగా మార్చివేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా తయారు చేసినట్లు చెప్పారు. అమ్మఒడి, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న గోరుముద్ద వంటి పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. ఈ క్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మళ్లీ వైఎస్ జగనే ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రానికి సుపరిపాలన అందించాలని కోరుకుంటున్నట్లు లేళ్ల వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ శ్యామల వెంకటరమణదేవి, గ్రామ పెద్దలు కుర్రి సాంబిరెడ్డి, లేళ్ల పెద్ద అప్పిరెడ్డి, మున్నంగి సంజీవరెడ్డి, గంగాధరరెడ్డి, గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్ షేక్ రోషన్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

27 నల్లపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బస్సుల వేలం

గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలోని ప్రభుత్వ మైనార్టీస్ కళాశాలలో ప్రభుత్వ బస్సుల వేలం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు మధ్యాహ్నం 12 గంటలలోగా తమ పేర్లను కళాశాలలో నమోదు చేసుకోవాలన్నారు. ఏపీ07ఎక్స్1963 బస్సు రిజర్వ్ వాల్యూ రూ 2,30,000లు, ఏపీ 07టీ1083 బస్సు రూ.2,20,000లు, ఏపీ07ఎన్3324 బస్సు రిజర్వ్ వాల్యూ రూ 55,000గా నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు నల్లపాడు ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలోని మైనార్టీస్ ఆటోమొబైల్ ఇంజినీరింగ్ సెక్షన్ సీనియర్ అధ్యాపకులు వి.హరికృష్ణ 94900 49518, ఏఎస్ సీహెచ్ సూర్యనారాయణ 94411 12983 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

మహాప్రస్థానంలో గ్యాస్ చాంబర్ కోసం విరాళం



విరాళం అందజేస్తున్న రమణయ్య, ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: బొంగరాలబీడులోని మహాప్రస్థానంలో గ్యాస్ చాంబర్ నిర్మాణ నిమిత్తం ఏనుగంటి చెంచయ్య స్మారకార్థం భోగినేని రమణయ్య, చెంచు ప్రసాద్ కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. గురువారం జరిగిన కార్యక్రమంలో చెక్కు రూపంలో విరాళాన్ని మహాప్రస్థానం కమిటీ సభ్యులు ధనియాల గాంధీ, పులివర్తి శ్రీనివాస్, కల్లూరు రమణయ్య, తిరువీధి రమణయ్య, ఎం. మాలకొండయ్య, జంగాపల్లి పార్థసారథికి అందజేశారు.